# ఆ నాలుగురాళ్ళూ...!!

**"మా** అమ్మొచ్చిందా" గుమ్మంలోకి తొంగిచూస్తూ అన్నాడు సోములు.

"ఫో, మీ అమ్మలేదు, గిమ్మలేదు" అరిచింది స్వెటర్ అల్లుతూ కూచున్న సుధారాణి.

'ఎందుకమ్మా ఆ పసివాడి మీద అలా అరుస్తావూ' కళ్ళజోడు సరిచేసుకుంటూ రాఘవయ్య అన్నాడు.

"అవును, అలాగే అరుస్తాను..... నీ కర్థం కాదులే" అంది కోపంగా సుధారాణి.

అంతోనే గబగబా లోపలికొచ్చింది రాములమ్మ. దానివెంటే సోములూనూ... తిన్నగా వంటింట్లో కెళ్ళింది రాములమ్మ... గట్టుమీదున్న గిన్నెలు, గ్లాసులు అన్నీ అందించింది సోములికి. సందులో కూచుని గబగబా అంట్లు తోముతుంటే, గుమ్మంలో నిలబడ్డ సుధారాణి 'అంతే, నీ కర్మ' అనుకుంది మనసులో, సోముల్ని చూస్తూ ఓ గంటలోపే ఇంట్లో ఉన్న పని అంతా చేసేశారు తల్లీ కొడుకు కలసి.

రాఘవయ్య అంతా గమనిస్తూనే ఉన్నాడు... రాములమ్మ నాలుగిళ్ళలో పనిచేస్తుంది. దానికి తోడుగా రోజూ సోముల్ని తెచ్చుకుంటుంది. రాములమ్మ మొగుడు యాదయ్య రిక్షా తొక్కుతాడు. నలుగు రాడపిల్లలు ఇద్దరు మగపిల్లలు వున్న రాములమ్మ పిల్లందర్నీ తలో ఇంట్లోనూ పనికి పెట్టింది. ఇద్దరాడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసింది. ఆఖరివాడు సోములు. పన్నెండేళ్ళుంటాయి. చాలా చలాకీగా, ఆరోగ్యంగా వుండే సోములంటే రాఘవయ్యకి చాలా ఇష్టం. రాఘవయ్య రిటైరయిపోయాడు. శాంతమ్మ రాఘవయ్య ఓ మూడునెలలు అమెరికాలో ఉన్న కొడుకులిద్దరి దగ్గరా ఉండి వచ్చారు. అక్కడుండగానే శాంతమ్మకి నాలుగురోజులు జ్వరం వచ్చింది. రొమ్ముపైన చిన్న కురుపొచ్చింది. అది ఏమైఉంటుందోనని రకరకాల ఊహలతో, భయంతో శాంతమ్మ దిగులుపడటమే కాక, అది ఏదైనా ఐతే ఆ ఖర్చంతా మనమెక్కడ భరించగలం అని ఖంగారు పడిపోయిన కోడళ్ళని, నిజమే అని తలలూపిన కొడుకుల్ని చూసి క్షణం ఆశ్చర్యపోయినా మరుక్షణంలో నవ్వుకున్నాడు రాఘవయ్య.

"అన్ని టెస్టులూ చేయించండి అమ్మకి" అని కొడుకు చెప్తుంటే నీకు అమ్మ అవడానికి ముందు నాకు అర్థాంగి, ధర్మపత్ని' - రాఘవయ్య ఆ మాటలంటుంటే గొంతు వణకటం కనిపెట్టక పోలేదు కొడుకు శివరాం.

వారం రోజులయేసరికి ఇంటికొచ్చేసిన ఆ దంపతులు హాయిగా ఊపిరి తీసుకున్నారు. 'మనింట్లో మనముంటే ఎంత హాయిగా ఉందో చూసావా' అన్నాడు రాఘవయ్య శాంతమ్మ కార్తీకమాసపు వత్తులు చేసుకుంటుంటే పక్కన కూచుని. 'ఊ' అంది శాంతమ్మ నవ్వి. ఇద్దరు కొడుకుల్ని దూరంగా పంపేయటం ఎప్పుడూ ఇష్టంలేదు రాఘవయ్యకి కానీ, వాళ్ళ విదేశాలకెళ్ళాలని, పెద్ద ఉద్యోగాలుబ చెయ్యాలని, బోల్డు డబ్బు సంపాదించాలనే కోరిక బాగా మనసులో నాటుకుపోయింది శాంతమ్మకి పిల్లలు చదువుకునే రోజుల్లోనే.

'చూశారా, మా అన్నకొడుకు, అదే విజయ్, చికాగోలో ఎంత సంపాదిస్తున్నాడో... మొన్న మా వదిన చెప్పింది ఈ ఫ్లాటు కొనడానికి డబ్బువాడే పంపాడుట' అంది పేపరు చదువుకుంటున్న రాఘవయ్యతో ఓనాడు.

"అవును, విన్నాను" అన్నాడు నిర్లప్తంగా. అలా ఎప్పుడూ ఎవరి గురించో ఒకరిగురించి, వాళ్ళబ్బాయి దుబాయ్ వెళ్ళాడు, వీళ్ళమ్మాయ్ అమెరికా వెళ్ళింది, అంటూ మాట్లాడి మాట్లాడి శాంతమ్మ ఆ పసివాళ్ళ మనసుల్లో ఎప్పుడెప్పుడు ఆ దేశాలకి ఎగిరిపోదామా అనే భావం బాగా నాటుకుపోయేలా చేసింది.

కాలం గిర్రున తిరిగింది. కూతురు సుధారాణి, అల్లుడు హైదరాబాదులో బ్యాంకు ఉద్యోగాలు చేస్తున్నారు. సుధారాణి కూతురు లలిత బొంబాయిలో ఉద్యోగం. ఆమె భర్తా అక్కడే... అయితే సమస్యేమిటీ!! - సుధారాణి ఓసారి సెలవులకు తండ్రి దగ్గరకొచ్చినపుడు రాములమ్మ. సోములు ఇంట్లో పనులు చేయటం చూసింది. ఈ పిల్లాడు భలేఉన్నాడే అనుకుంది సోముల్ని చూస్తూ.

మేడమీద సన్నజాజి పూలన్నీ కోసి తండ్రి పూజచేసుకునే సమయానికి పూలసజ్జలో పెట్టి గదిలో పెడతాడు సోములు. ఆరేసిన బట్టలన్నీ చక్కగా మడతలు పెట్టి సద్దుతాడు. ఒక్కనిమిషంలో సైకిలిమీద అలావెళ్ళి కూరలు తెచ్చి వంటింటి గుమ్మంలో పెడతాడు... నిజంగా ఇలాంటి పనిపిల్లాడుంటే ఇంట్లో ఎంత హాయిగా ఉంటుందో!! సుధారాణి సోములు వంక చూసింది. వాడు రాఘవయ్య కూర్చున్న కుర్చీపక్కన కూచుని పేపర్లో ఉన్న సినిమా బొమ్మలు చూస్తున్నాడు. అంతలోనే ముందుగదిలోకి పరిగెత్తి టి.వి. ముందర సినిమా చూస్తూ కూచున్నాడు సోములు. శాంతమ్మ సోఫాలో పడుకుని సినిమా చూస్తూ. 'ఇదిగో, ఇవి తిను, అంటూ వేగోడీలు వాడి చేతిలో పెట్టింది.

సుధారాణి తండ్రి దగ్గరకొచ్చి కుర్చీ జరుపుకుని దగ్గరగా కూచుంది రాఘవయ్య పేపరు కింద పడేశాడు.

"అన్నయ్య మళ్లీ రమ్మని రాశాడు కదా, వెడుతున్నారా" అంది సుధారాణి.

'ఒకసారి వెళ్ళాంగా... చాలు'

"అయినా ఇక్కడ మీకేం పనుంది నాన్నా.... ఇద్దరూ హాయిగా అక్కడుండచ్చుగా. ఈ ఇల్లు అద్దెకిచ్చేయండి మీరు కూడా అక్కడ ఏదానా పనిచేయొచ్చు" అంది తండ్రివైపు చూస్తూ.

రాఘవయ్య పెద్దగా నవ్వాడు.

"ఏమిటమ్మా... సుఖమేమిటీ, హాయి ఏమిటీ - అక్కడ హాయి - ఇక్కడ లేదా"

"ఏమిటి నాన్నా... మీ ఇష్టం. వెళ్ళాలనిపించక పోతే మానేయండి" అంది చిరాగ్గా సుధారాణి.

"ఉరుగుల పరుగుల జీవితంలో ఎంత హాయిఉందో చూశాను. అయినా నాలుగు రాళ్ళు సంపాదించుకోటానికి అంత దూరం వెళ్ళాలా" రాఘవయ్య ముఖం సీరియస్ అవటం గమనించింది సుధారాణి. ఈ మధ్య తండ్రి చాలాసార్లు ఇలాగే మాట్లాడుతున్నాడని, మనిషి హాయిగా ఉండడానికి ఇన్ని పరుగులు అక్కర్లేదని అందరితో అనటం వింటున్న సుధారాణి చాలా కోపమొచ్చింది. లేచి వెళ్ళి పోవాలనుకుంది అక్కడ్నుంచి.

"కూచో, ఏమిటి చెప్పు - మీ ఆయన ఎప్పుడొస్తున్నాడూ" అన్నాడు రాఘవయ్య.

"ఏమో - రావద్దని చెప్పాలనుకుంటున్నా" అంది ఎటో చూస్తూ

"అంటే"

"అదే నాన్నా - నువ్వు మాట్లాడవు, అమ్మ మాట్లాడదు" అంది.

"చెప్పాకదా - దానికిష్టం లేదు మరి"

సుధారాణి కోపంగా అరిచింది. "ఎందుకిష్టం లేదట - డబ్బు చేదా! మీరిచ్చే దానికన్నా ఎంతో ఎక్కువ యిస్తానంటున్నాను - అయినా నాన్నా మీకు నా ఇబ్బంది తెలియటం లేదు -"

సుధారాణి గొంతు జీరపోయింది...

ఇంతకు ముందున్న పనిమనిషి మానేసింది. ఇప్పుడు చాలా అర్జంటుగా సోముల్ని తనతో తీసికెళ్ళాలని వచ్చింది. పైగా సోములు తల్లి రాములమ్మ ఈ ఇంట్లో చాలా ఏళ్ళుగా బాగా నమ్మకంగా పనిచేస్తోంది. వాడికిచ్చే జీతమంతా తల్లికి పంపించవచ్చు భోజనం, బట్టలు అన్నీ వాడికి తనే చూస్తుంది - ఇంకేం కావాలీ!! - సుధారాణి అనుకుంటూ వీధివైపు చూసింది. సోములు ఎప్పుడొచ్చాడొ ఏమో, వీధిలో ఉన్న కారు శుభ్రంగా తుడుస్తున్నాడు.

"ఇలారా, సోములూ" అంది సుధారాణి.

"నాతో వస్తావా, మా ఊరూ తీసికెడతా"

"మీ ఊరా" "ఆ"

రాఘవయ్య సోములు వంక చూస్తూ -

"వెళ్ళరా... నీకు మంచి భోజనం పెడుతుంది. బట్టలు కొని పెడుతుంది. వాళ్ళు సినిమాకు వెళ్ళినప్పుడల్లా నిన్నూ తీసికెడతారు. ఇంకా జీన్సు పాంటు కొనిపెడుతుంది.

సోములు నవ్వాడు. "ఏమిటి, వస్తావా మరి" అంది సుధారాణి. 'మా అమ్మ నడగండి' సోములు మాట్లాడకుండా ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు.

"ఎలాగైనా ఆ రాములమ్మతో చెప్పండి నాన్నా, కావాలంటే జీతం ఇంకా ఎక్కువిస్తాను. మీ అల్లుడు కూడా అదే అన్నారు. సోముల్ని వెంట పెట్టుకు వెళ్ధామనే నేను వచ్చింది" అంది సుధారాణి.

రాఘవయ్య పడక్కుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు. రాములమ్మని ఒప్పించి పిల్లాడిని కూతురితో పంపిస్తే బాగానే ఉంటుందని.. తల్లికి సాయంగా వుంటూ అంతో ఇంతో సంపాదిస్తున్నాడు సోములు. పైగా రాములమ్మ, యాదయ్య వున్నంతలో హాయిగా బతికే మనుషులు. డబ్బుకోసం హైదరాబాదు పంపమంటే పంపదు. ఆ విషయం కూతురు అర్థం చేసుకోదు. రాఘవయ్యకి ఏం చేయాలో తోచలేదు.

"నాన్నా మీరేవిషయం నాకు చెప్తే నేను ఫ్లైట్ టిక్కట్లు కొనుక్కుంటాను" అంది గంభీరంగా ముఖం పెట్టి కూతురు.

"డబ్బు చేదా" అంటుంది కూతురు. "ఎంత కావాలయ్యా... చిన్న పొట్టకి" అంటూది రాములమ్మ - ఏమిటో మరి!!

రాములమ్మ తులసికోట గుమ్మం దగ్గర కూచుని గోధుమలు బాగుచేస్తోంది. శాంతమ్మ రాములమ్మతో ఏదో మాట్లాడుతుంది.

రాములమ్మ చెల్లెకొడుకు దుబాయ్‌లో మెకానిక్ పని చేస్తున్నాడు. వారం రోజుల నాడు ఒళ్ళు కాలిచచ్చిపోయింది రాములమ్మ చెల్లెలు, కొడుకొచ్చేవరకు ఆ శవాన్ని హాస్పిటల్‌లో శవాల గదిలో ఉంచారట. రాములమ్మ చెల్లెలి కొడుకు ఊళ్ళో లేకపోతే, కబురు తెలిసి వచ్చేసరికి రెండు రోజులయిందట. ఈ కబుర్లన్నీ చెప్తూ గోధుమలు బాగుచేస్తున్న రాములమ్మ.

"ఆ నాలుగురాళ్ళూ ఇక్కడే సంపాదించుకోరా అని ఎంత చెప్పినా వినకపోయె. నా చెల్లి ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుంది" అంది "అవునే రాములమ్మ - డబ్బు డబ్బని ఊరికే పరుగులు పెట్టడం వెర్రికాక మరేమిటీ - " అంది సిగపిన్నులు సరిచేసుకుంటూ శాంతమ్మ.

ఆ సంభాషణంతా వింటున్న సుధారాణి చిరాగ్గా వుంది. రాత్రి భర్త ఫోన్ చేస్తాడు. సోములు విషయం ఏం తేలలేదు. తనకి సెలవయిపోతుంది. తన బాధ అమ్మ నాన్నకి పట్టటం లేదు. గబగబా ముందుగదిలో కొచ్చింది. తండ్రి పడక్కుర్చీలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. రాములమ్మ గోధుమలు డబ్బాలో కెత్తింది. శాంతమ్మ లేచి టి.వి. ముందర కూచుంది.

"రాములమ్మ... ఇలారా, మంచినీళ్ళు తీసుకురా"

రాములమ్మ మంచినీళ్ళు తెచ్చి గ్లాసు సుధారాణికిచ్చి నిలబడింది.

"ఏమంటావు - నాన్న చెప్పారుగా మరి" అంది సుధారాణి. రాములమ్మ సమాధానం చెప్పలేదు.

"నీకే భయంలేదు -వాణ్ణి బాగా చూసుకుంటా. వాడికిచ్చే జీతం నెలనెలా నీకు పంపిస్తా. నీక్కావాలంటే ఏడాది జీతం ముందిమ్మంటే యిస్తా. నెమ్మదిగా వాడికి నాలుగక్షరం ముక్కలు చెప్తా - ఏమంటావ్" అంది సుధారాణి.

"చదువుకుని వాడేం చేస్తాడమ్మా" అంది రాములమ్మ.

"సరేలే - ఎంత జీతం యివ్వమంటావ్" అంది సుధారాణి. రాములమ్మ మాట్లాడలేదు.

"అడిగి చెప్తా" అంది. "ఎవర్నిడిగి" అంది సుధారాణి.

"తండ్రి ఏమంటాడో" అంది, అలా అంటూనే చీపురు తీసుకుని గదులు తుడవటం మొదలు పెట్టింది.

"పంపిస్తుందా, పంపదా" - సుధారాణికి చాలా విసుగ్గా ఉంది. సోములు తనతో ఉంటే రాములమ్మకే మంచిదిగా, డబ్బులు దాచుకోవచ్చు, ఎప్పటికీ వాణ్ణి తనదగ్గరే ఉంచేసుకుంటూుందా - ఏమిటో!!

"నాన్నా, ఆ యాదయ్యని అడగండి - పిల్లాడిని నాతో పంపించమని - బోల్డు డబ్బు - ఊరికే వస్తుందా - డబ్బేమయిన చేదా-" గట్టిగా అంది సుధారాణి.

రాఘవయ్య నవ్వి ఊరుకున్నాడు. నిన్న మధ్యాహ్నపు టెండలో ఏ.సి. వేసుకుని కార్లోతను వస్తుంటే, రోడ్డు పక్కనున్న చెట్టుకింద ఓ చిన్న పాత దుప్పటి లాంటిది పర్చుకుని, హాయిగా నిద్రపోతున్న ఆ వ్యక్తి ఎంతధన్యుడు - వాడే సుఖజీవి!!

రెండు రోజులయ్యాక రాములమ్మ గుమ్మంలో కూచుని గొంతుతగ్గించి, శాంతమ్మతో ఏదో చెప్తోంది. యాదయ్య బాగా కొట్టాడు రాములమ్మని. డబ్బుపిచ్చి పట్టిందా అంటూ జుట్టు పట్టుకు లాగి తన్నాడు. ఇవేళ ఏడాది అని వెళ్ళాక పట్నం వదిలి వాడు రాడు అన్నాడు. అయినా పిల్లాణ్ణి వదిలి ఉండలేను. ఆ నాలుగురాళ్ళూ ఇక్కడే సంపాదిస్తాడు. ఉంటే రెండు పూట్లు తింటాడు. కాకపోతే ఒక్కపూట. అంతే - యాదయ్య అన్న మాటలన్నీ చెప్పి "అమ్మా నిజం చెప్పొద్దూ, నేనూ ఆశపడ్డా, నాలుగు రాళ్ళు సంపాదించుకొస్తాడని" అంది మోచేతిమీదున్న వాపు శాంతమ్మకి చూపిస్తూ రాములమ్మ.

శాంతమ్మ ఏమీ అనకుండా వింటోంది. యాదయ్య చెప్పిందాంట్లో ఎంతో నిజముందనిపించిదా క్షణం.

"సరేలే, నువ్వెళ్ళు" అంది శాంతమ్మ. రాములమ్మ అటు వెళ్ళగానే యాదయ్య రిక్షా గుమ్మంలో ఆపి లోపలికొచ్చాడు. వీధి గదిలో రాఘవయ్య దగ్గరికొచ్చి, కింద కూచున్నాడు.

"ఏమంటావ్" అన్నాడు రాఘవయ్య. "అ... వద్దయ్యా - ఎంత డబ్బుంటే మనిషికి చాల్తయి - ఇంతన్నం తినటానికి ఎంత సంపాదించాలయ్యా - పిల్లాడినొదిలి నేనుండలేను. అయ్యా, ఒక్క మాట, ఆ నాలుగురాళ్ళూ, ఇక్కడే కష్టపడి సంపాదిస్తే మా కళ్ళ ముందుంటాడు కదయ్యా."

- యాదయ్య ఇంకా ఏదో మాట్లాడుతున్నాడు. రాఘవయ్యకి ఆ తర్వాత మాటలేం వినిపించలేదు. యాదయ్య చెప్తున్న మాటల్లో నిజం లేదని ఎలా అంటాడు తనుమాత్రం - రాఘవయ్య కళ్ళలో ఓ నీటిపొర కదిలింది!! -

"ఆ రాళ్ళో, రప్పలో, వాడు మీరు తేల్చుకోండి" - సుధారాణి కోపంగా సట్కేసు సద్దుకుంది.

రాఘవయ్య దీర్ఘంగా నిట్టూర్చాడు. తాగుబోతు యాదయ్య ఎంత మంచి నిర్ణయం తీసుకున్నాడో అని మనసులో అనుకుంది శాంతమ్మ.

'ఉండు, నిన్ను కార్లో దింపుతాను' అన్నాడు రాఘవయ్య కూతురితో.

'అక్కర్లేదు - నేను ఆటోలో వెళ్ళగలను!' సుధారాణి సూట్‌కేసు పట్టుకు గుమ్మంలో నిలబడింది ఆటోకోసం. రాఘవయ్య కారు తాళాలు చేతిలో కదులుతుంటే, కదిలిపోతున్న ఆటోవంక చూస్తూ నిలబడ్డాడు.

"ఇంటింటి చిత్రాలు" మూసీ

- సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

నవంబర్-డిసెంబర్ 1999

కథా నిలయం
శ్రీకాకుళం